


సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 15 | ఏప్రిల్, 2019 | సంచిక : 11



**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**


**సాయివాణి చందా వివరాలు**

| | |
|---|---|
| వార్షిక చందా ... | రూ॥ 100/- |
| ద్వైవార్షిక చందా. ......... | రూ॥ 200/- |
| ఆజీవ సభ్యత్వం ........... | రూ॥1000/- |


**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, పెద్ద పర్వతాపురం గ్రా,
రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
**Ph : 9440413455, 9848133565**


**విషయసూచిక** — **పుట సంఖ్య**


| విషయసూచిక | పుట సంఖ్య |
|---|---|
| మా వాణి | 2 |
| భక్త కథా సుధ | 4 |
| మువ్వల మురళి | 7 |
| సాయి సేవక్-శ్రీ శివనేశన్ | 11 |
| ఎన్నికల వేళ | 15 |
| శ్రీరామ నవమి కళ్యాణ | 17 |
| మాతృసంస్థ కబుర్లు | 19 |
| భగవన్నామ మహిమ | 24 |
| జ్ఞానధామం-3 నిర్మాణం | 27 |
| బాలవాణి | 29 |


ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.



సాయి వాణి



# మా వాణి



సాయి బంధువులందరికీ సవినయ నమస్సుమాంజలి. పరమ భాగవతోత్తములైన గురుజనులందరికీ సాష్టాంగ నమస్సులు.

వికారి నామ సంవత్సరంలో చక్కని సాధకులుగా రూపొందాలన్న దృఢసంకల్పంతో అడుగు ముందుకు వేయాలని గత మాసంలో అనుకున్నాం. అయితే ఆ గమ్యాన్ని చేరేందుకై మనం చేయవలసినది ఏమిటో ఓసారి పరిశీలిద్దాం. దీనికి మూడు మెట్లు-త్రి సకారాలు అవసరం అని పరమపూజ్య గురుదేవులెప్పుడూ హెచ్చరిస్తూ ఉంటారు. అవి సంకల్పం, సంసిద్ధత, సాధన అన్నవి.

అనేకమంది జీవితాలు ఏదో గాలి పాటుకు కొట్టుకుపోతున్నట్లుగా, సుడిగుండానబడి వలయంలో తిరుగుతున్నట్లుగా సాగిపోతుంటాయి. ఒక్క క్షణమైనా ఆగి తమ జీవితాలు తాము పరిశీలించుకొనేందుక్కూడా ఏ మాత్రం అవకాశం లేనట్లుగా-బిజీగా-వ్యామోహాలతో, మమకారాలతో, లాలసలతో ఊపిరాడకుండా ఉంటాయి. అలాటి వారికి మొట్టమొదటి మెట్టైనా "సంకల్పం" అనే దాన్ని చేరే వీలు కూడా ఉండదు. తమ జీవితాలకు మించింది మరొకటి ఉన్నదనీ, అసలు అదే శాశ్వతమైనదనీ అలాంటి వారికి తోచదు. ఒకవేళ తోచినా ఆ శాశ్వతమైన దాన్ని పొందాలన్న తపనా కలుగదు. అంచేత - మొట్టమొదట మనం ఏది సర్వశ్రేష్ఠమైన పదమో గుర్తించాలి. అటుపైన ఖచ్చితంగా దాన్ని అందుకోవాలన్న స్పష్టమైన సంకల్పాన్ని ఏర్పరచుకోవాలి. ఆ సంకల్పం సుదృఢం కావటం కోసం ఆత్మ విచారం, ఆధ్యాత్మిక గ్రంథ పఠనం అవసరం. వేరే సంకల్పం కలిగింది ఆ తరువాత?

మన సంకల్పాన్ని ఎలాగైనా పరిపూర్ణం చేసుకోవాలి. అందుకోసం ఎన్ని కష్టాలకైనా, నష్టాలకైనా ఓర్చుకోగలగాలి. అంతవరకూ లోకంతోపాటు వాళ్ళంగా, ముసలివాళ్ళం కాస్త త్రోవ మార్చుకొనేటప్పటికి అంతదాకా మిత్రులుగా ఉన్నవాళ్లు దూరమవుతారు. మనసులో ప్రశాంతత నెలకొంటుండగా పరిసర వాతావరణంలోనూ, గృహ వాతావరణంలోనూ అశాంతి పెరుగుతూ ఉంటుంది. దీన్నంతటినీ సహిస్తూ కూడా మన సంకల్పం వైపే నడుస్తూ ఉండటానికి సంసిద్ధులం కావాలి. అంతేకాదు- క్రమంగా ఐహిక విషయాల పట్ల, తన శరీరం పట్ల కూడా విరక్తి పెంచుకొంటూ పోవాలి. ఇది అశాశ్వతం-అయోగ్యం అని పదేపదే మనసుకు చెప్పకుంటూ ఉండాలి. ఇదంతా సంకల్పసిద్ధికి సంసిద్ధత.

ఇక మూడవదీ - అత్యంత ప్రధానమైనదీ సాధన. యమ నియమాలలో ఒక్కొక్కదానినీ సాధన చేస్తూ ముందుకు సాగాలి. ఉదాహరణకు యమాలలో తొలుతటిదైన "సత్యం" గురించి విన్నాం. వెంటనే దాని మీద మనలో మనం మథనం సాగించాలి. ఇదే అంతర్మథనం. "సత్యం" అన్నది నాలో ఉందా? నేను నిజంగా సత్యాన్ని పాటిస్తున్నానా? నాకు అనుకూలంగా ఉన్నప్పుడు పాటించి కానప్పుడు నెట్టి పారేస్తున్నానా? సత్యం లాగా భ్రమింపజేసే అసత్యాలు పలుకుతున్నానా? ఆడి తప్పటం, అన్న సమయాన్ని పాటించకపోవటం - యివన్నీ కూడా అసత్యం క్రిందకే వస్తాయి. మనలో ఒకటి ఉంచుకొని పైకి మరొకటి మాట్లాడితే - అదీ అసత్యానికి పాల్పడినట్లే అవుతుంది. అంచేత వీటన్నిటిలో నేనేదీ చేయటం లేదు గదా! ఇంతేగాక - సత్యం చెప్పాలనే ప్రయత్నంతో ఎవరికీ ద్రోహం చెయ్యడం లేదుగా! (అనేకమందికి కీడు చేసే సత్యం కూడా అసత్యంతో సమానమే!) - ఇలా విశ్లేషించుకొంటూ వెళ్లాలి. దాని నిగ్గుతేలాక - "సత్య పాలన" అన్న దాన్ని అభ్యాసంలోకి తెచ్చుకొని, అటుపైన మరో అడుగు - యమాలలో రెండవదైన అహింసను గూర్చి యోచన ప్రారంభించాలి.





ఇలా ఒక్కొక్కమెట్టే ఎక్కుతూ వెళ్లాలి.

సాధనలో తొందరపాటు ఏ మాత్రమూ పనికిరాదని శాస్త్రం చెప్తుంది.

యమ నియమ సాధన లేకుండానే సరాసరి ధ్యానాలు, సమాధి అంటూ బయలుదేరటం కేవలం అవివేకం అవుతుంది. పైగా పతన హేతువు కూడా అవుతుంది. యమ నియమ సాధన చాలా కష్టమైనది గనుక "ఇవన్నీ అక్కర్లేదు - ఐదు నిముషాల్లో ఆత్మ సాక్షాత్కారం కలిగిస్తాము - రెండు నిముషాల్లో కుండలిని నిద్ర లేపుతాము" అనే నినాదాల వెంట పరుగులు తీస్తే ఫలితం - ఆ ఉన్న కాస్త జీవితం కూడా వ్యర్థం కావటం తప్ప మరేమీ ఉండదు. అంచేత క్రమక్రమంగా మన ప్రాచీన ఋషివర్యులు బోధించిన అష్టాంగ యోగ సిద్ధికై సంకల్పం, సంసిద్ధత, సాధనలకు నేటి నుంచే శ్రీకారం చుడదాం. ఆ సకార త్రయాన్ని మనకిమ్మని శ్రీ బాబాను ప్రార్థిద్దాం.



## భక్త కథాసుధ

# జనాబాయి

\- ప్రభుజీ

(గత సంచిక తరువాయి)

భక్త నామదేవుల యింటికి స్వామి సాకారంగా రాకపోకలు చేస్తూ ఉంటారని కొందరు విని ఉన్నారు. వారు జాగ్రత్తగా పరిశీలించి ఆ బొంత జానాబాయిదిగా గుర్తించారు. పూజారులతో కలిసి భక్త జనమంతా నామదేవుని యింటికి చేరారు. తన కేవిషయమూ తెలియదని నామదేవుడు చెప్పాడు. జనాబాయిని ప్రశ్నించారు. ఆ నగల సంగతి తనకూ తెలియదని చెప్పింది. అయినా ఆమె మాటలు నమ్మక కొందరు ఆమె పూరి గుడిసెలోనికి చొరబడ్డారు. అక్కడ ఒక మూలగా పాండురంగని ఉత్తరీయమూ, దాని క్రింద స్వామి వారి అమూల్యాభరణాలూ కన్పించినై.

అంతవరకూ జనాబాయి వాటిని చూడనే లేదు. కాని ఆ మూర్ఖ జనం ఆమె మాట విన్పించుకుంటారా? "తన పాటలతో స్వామిని వశం చేసుకొని ఈ నగలు కాజేసి కులుకుదా మనుకొంటున్నది. ఈమె చేసిన నేరం సామాన్యమైనది కాద"ని ఈర్ష్యాళువులైన పూజారులు ఆమె మీద అభియోగం మోపారు. తాను అమాయకు రాలననీ, పాండురంగని భక్తి తప్ప ఈ ప్రపంచంలో తనకేమీ తెలీదనీ ఎంతగా ఆమె వాదించినా న్యాయాధిపతులు ఆమె మొరను ఆలకించలేదు. ఆ పరమ భక్తురాలిని స్వామి ఆభరణాలు కాజేసిన దొంగగా నిరూపించి మరణదండన విధించారు. అది కూడా సర్వజనావళి సమ్ముఖంలో శూలానికి గుచ్చి అమలుచేయాలని శాసించారు. అసూయా పరులకిదొక మంచి అవకాశం. మంచివాళ్ళు బాధలనుభవిస్తుంటే చూసి ఆనందించటం వారి అలవాటు. జనాబాయి చేతులను సంకెళ్ళతో బంధించి వధ్యస్థలానికి ఈడ్చుకొనిపోతున్నారు. శరీరమంతా కొట్టుకొని పోయి రక్తసిక్తమైంది. "మీరు రమ్మన్న చోటికి నా అంతట నేనే వస్తాను. ఈ విధంగా బాధించవద్దన్నా" వాళ్ళు వినలేదు. ఆమె యిక ఎవ్వరినీ అడగ దలచలేదు. బాధనిచ్చినా, వేదననిచ్చినా మోదాన్నిచ్చినా అన్నిటికీ తన పాండురంగడే గతియని గాఢంగా విశ్వసించింది. ఆయన నామస్మరణతో తన బాధల్నీ, లోకాన్నీ మరచిపోయింది.

జనాబాయిని వధ్యస్థల వేదిక మీదికి ఎక్కించారు. ఆమె మంచి వాళ్ళకు మంచిగాను, చెడ్డవాళ్ళకు చెడ్డగాను కన్పించింది. భక్తురాలిని ఈ విధంగా బాధించినందుకు వీళ్లకు తగిన శాస్తి జరగదా అని కొందరను కుంటే, భక్తురాలి ముసుగులో యీమె దొంగతనానికి పాల్పడుతున్నదని మరికొందరు భావించారు. జనాబాయి తన నెత్తిన పడ్డ యీ అపనిందకు కృంగిపోయింది. మరణం ఎప్పడైనా తప్పదు. కాని ఈ మానవజన్మలోనే తన హృదయాధినాధుని సేవ మరికొంత కాలం చేసుకొనే అవకాశం లేకపోయెనే అని దుఃఖించింది. ఈ ఆపద నుండి తప్పించడానికి





మరెవ్వరినీ వేడుకొనక తన సర్వస్వమైన పాండురంగడినే ప్రార్థించింది. ఇంత వరకూ తన హృదయంలో ఎవవరికి తప్ప స్థానం లేదో, తన నాలుక ఎవరిని తప్ప కీర్తించలేదో అతడే దీనికంతటికీ బాధ్యుడనీ, ఇచ్చినా పుచ్చుకున్నా ఆయనేననీ పరిపూర్ణ విశ్వాసంతో ధ్యానిస్తోంది.

శిక్ష అమలు జరపటానికి ఆమెను శూలం దగ్గరకు లాక్కువెళ్ళారు. శూలంతో గుచ్చబోతూ ఉండగా ఆశ్చర్యం! అది భగ్గున మండి బూడిదగా రాలింది. ఒక్కసారిగా పాండురంగని దివ్యకాంతి ఆమెలో మెరుపువలె మెరిసి మాయమైంది. ఆమె చెప్పింది సత్యమనీ, పాండురంగడే ఆమె భక్తి మహాత్మ్యాన్ని వెల్లడించటానికి యీ నాటకం ఆడించాడనీ అందరికీ అర్థమైంది. వధ్యస్థలి సన్మాన వేదికగా మారింది. అందరినోటా జనాబాయికి జయ జయ ధ్వానాలే. గొప్ప ఊరేగింపుతో అందరూ పాండురంగాలయానికి చేరారు. ఆమెకు మాత్రం అవమాన సన్మానాలు రెండూ సమానమే. తన దైవం చూపించిన ఈ లీలకు తన్మయురాలై అనేక అభంగాలతో పాండురంగని కీర్తించింది. ఆమె కీర్తి నలుదెసలా ప్రాకింది. భక్తులు తండోప తండాలుగా ఆమె దర్శనానికై రాసాగారు.

ఒకసారి మహాజ్ఞాని జ్ఞానేశ్వర మహారాజు పండరీ వచ్చినప్పడు జనాబాయి పాడుతున్న అభంగాలను స్వామి లిఖిస్తూ ఉండటం చూశాడు. ఆశ్చర్యంతో అడిగాడు "స్వామీ యిదేమి పక్షపాతమని".

పాండురంగడు చిరునవ్వుతో సమాధానం చెప్పాడు. "ఆమె హృదయాంతరాలలోంచి ఉప్పొంగి వచ్చే భక్తి రసామృతమే ఈ అభంగాలు. ఆమెకు వ్రాయ చేతగాదు. ఇవి భవిష్యత్తులో అనేకమంది భక్తుల్ని తరింప జేయగలవు. వాటిని చిరస్థాయిగా చేసి అందించటానికే నేనీ విధంగా లిఖిస్తున్నా"నన్నారు.

భగవంతునే లేఖకునిగా చేసుకోగల్గిన ఆ జనాబాయి భక్తి ఎంత ఘనమైనదో కదా!

బాలవాణి



# మువ్వల మురళి

- శుకవాణి

**(గత సంచిక తరువాయి)**

"మరీ కొంచెమే ఉంది కదూ! మరేం చేస్తాం ఇవ్వాళెక్కువ లేదు. సరే-ఒక పని చెయ్యి 'ఇంతేనా' అని ఎవరైనా అంటే గట్టిగా కళ్లు మూసుకొని మనసులో కిష్టుడినీ నన్నూ తలుచుకో-ఏం?" అన్నాడు.

"అలా తలుచుకుంటే ఏమవుతుందీ?" అని అడిగాడు మురళి. "అది రహస్యం! చెప్పకూడదు. తర్వాత నీకే తెలుస్తుందిగా!" అన్నాడు శ్యాముడు చిరునవ్వుతో. మురళి మనోహరమైన ఆ నవ్వు అలాగే చూస్తూ నిలబడ్డాడు ఒక్క క్షణం. తరువాత -

"మరి నేను వెడతాను" అన్నాడు మువ్వల మురళి నొకచేత్తోనూ, పెరుగు ముంత మరో చేత్తోనూ పట్టుకొని, శ్యాముడు తలూపాడు వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ యింటి దారి పట్టాడు మురళి.

✡ ✡ ✡

వాడు ఇంటికి చేరేటప్పటికి కొద్దికొద్దిగా చీకటి పడుతోంది. కామాక్షి పని నుంచీ యింకా యింటికి రాలేదు. మురళి పెరుగు ముంతను తను పుస్తకాలు పెట్టుకునే గూట్లో వెనక్కి దాచిపెట్టాడు. తను అంత దూరం నడిచాడంటే తల్లి బాధపడుతుంది. వాడు తన సాహసయాత్రను గురించి తల్లికి చెప్పదలచుకోలేదు. అందుకనే -

గబగబా కాళ్లూ చేతులూ కడుక్కొని వేణువు తీసి వాయించుకుంటూ కూర్చున్నాడు. ఏమీ ఎరుగని వాడిలాగే.

మరునాడు తెల్లవారింది. పిల్లలందరూ ఎంతో ఉత్సాహంగా నిద్ర లేచారు. శుభ్రంగా బావుల దగ్గర చన్నీళ్ల స్నానాలు చేసి, ఉతికిన బట్టలు వేసుకున్నారు. వాళ్లు తీసుకువెళ్లవలసిన సరుకులన్నీ మోసుకుంటూ బడి





వైపు సాగిపోయారు. మురళి కూడా బడికి చేరుకున్నాడు -

అప్పటికి అయ్యవారు వచ్చేసారు. బడంతా ముగ్గులతో, తోరణాలతో కళకళలాడిపోతోంది. వంట కోసం పాకలో పొయ్యి తవ్వారు. అయ్యవారి భార్యా, మరో ఆవిడా కూరలు కోస్తున్నారు. మురళి తన సంచి కదలకుండా చేత్తో పట్టుకొని తన తరగతి గదిలోకి వెళ్లాడు. అక్కడ రెండు పెద్ద బానలు పెట్టారు. ఒక బాన నిండా నీళ్లు నింపిపెట్టారు. రెండవ బాన ఖాళీగానే ఉంది. మురళి వెనక్కు తిరగబోయేంతలో బాచీ హడావుడిగా వచ్చి "మన వాళ్లంతా యింకా రాలేదేంరా?" అని అడిగాడు. మళ్లీ తనే "చూద్దాం పద" అంటూ మురళిని బయటకు లాక్కుపోయాడు.

మరి కాస్సేపట్లో అంతా వచ్చేసారు. బాచీ తన దళం పిల్లలందరినీ వరుసలో నిలబెట్టాడు. మురళి కాస్త పొట్టివాడు గనుక వాడు మూడోవాడు వరుసలో. వాడు తన ముందు నిలబడ్డ పిల్లల చేతుల వైపు చూచాడు. పెద్దపెద్ద గిన్నెలున్నాయి వాళ్ల చేతుల్లో. మురళికి మనసులో కాస్త చివుక్కుమంది. కానీ, వెంటనే శ్యాముడి మాటలు గుర్తుకు వచ్చాయి వాడికి. తననిగానీ, కిష్టణ్ణిగానీ తలుచుకుంటే ఏదో జరుగుతుందన్నాడు గదా- ఫర్వాలేదు - అనుకున్నాడు. అయ్యవారు వచ్చారు. బాన శుభ్రంగా కడిగి ఉందో లేదో పరిశీలించారు. ఆ తరువాత - "ఊఁ! రండి యిక పొయ్యండి అన్నారు.

ముందుగా బాచీ తాను తెచ్చిన రెండు శేర్ల పెరుగు గిన్నెని అతి కష్టం మీద ఎత్తి బానలోకి వంపాడు - తెల్లని గడ్డ పెరుగంతా. ఆ తరువాత రాజూ, రవీ పోసారు. ఇక మురళి వంతు - మురళి వణుకుతున్న చేతులతో సంచిలో నుంచీ శ్యాముడిచ్చిన చిన్న ముంత పైకి తీసాడు. అది చూచీ చూడగానే పిల్లలంతా ఫక్కున నవ్వారు.

మురళికి కన్నీళ్లు వచ్చేలా ఉన్నాయి. వాడు వెంటనే మనసులో "కృష్ణా! కృష్ణా! శ్యామా! కృష్ణా!" అనుకోసాగాడు. అయ్యవారు పిల్లలవైపు చూచి "ష్! తప్పు గదూ! ఎవరెంత తెచ్చారన్నది కాదు కావలసింది. మొత్తం మీద

అందరం కలిసి సరిపోయేంత తేవాలి - అంతే. బాచీ చాలా తెచ్చాడుగా. మురళి కాస్త తక్కువ తెస్తే ఏం!" అని కోప్పడ్డారు. ఆ తర్వాత "ఊఁ వెళ్లు మురళీ! అది బానలో పోసెయ్యి" అన్నారు మురళిని చూస్తూ. కానీ మురళి కదల్లేదు. వాడికి దుఃఖం ముంచుకొస్తోంది. ఆగకుండా మనసులో "శ్యామూ, కృష్ణా, కృష్ణా, శ్యామూ!" అంటూనే ఉన్నాడు. వాడి బాధ అయ్యవారికి అర్థమైంది. ఆయన మురళి దగ్గరకు వచ్చి, వాడి చేతిలోని ముంత తీసుకొని, వాడి భుజం మీద చిన్నగా తట్టి ముందుకు వెళ్లారు. పిల్లలంతా నిశ్శబ్దంగా ఉన్నారు.

ఆ చిన్న ముంతలో నుంచీ పెరుగు బానలోకి పడుతోంది. చూడ్డానికి చిన్నగా ఉంది గానీ ముంతలో చాలా పెరుగే ఉన్నట్లుంది. ఒక నిముషం గడిచినా యింకా పెరుగు వస్తూనే ఉంది. అయ్యవారు కాస్త ఆశ్చర్యంగా ముంత పైకి మామూలుగా తిప్పి యింకెంత పెరుగుందో చూడబోయారు - అరె! నిండా ఉంది! ఆయన తెల్లబోయి మళ్లీ బానలోకి వంపారు. పెరుగు పడుతోంది. కాస్సేపయ్యాక అయ్యవారు మళ్లీ పైకి తిప్పి చూస్తే మళ్లీ ముంత నిండుగా పెరుగుంది! ఈసారి అయ్యవారు మురళివైపోసారి చూచి, చిరునవ్వుతో మళ్లీ ముంత బానలోకి వంచి పట్టుకుని అలాగే నిలబడ్డారు, గట్టి పెరుగు కెరళ్లు కెరళ్లుగా బిళ్లలు బిళ్లలుగా అలా పడుతూ - పడుతూ-పడుతూ - చూస్తుండగానే అంత పెద్ద బానా పెరుగుతో నిండిపోయింది. అయ్యవారు ముంత మామూలుగా తిప్పి మురళిని దగ్గరకు రమ్మని పిలిచారు.

మురళికిదంతా వింతగానూ ఉంది, సంతోషంగానూ ఉంది. మెల్లగా అయ్యవారి దగ్గరకు వెళ్లాడు. ఆయన చేతిలోని ముంత బాచీ చేతికిచ్చి మురళిని దగ్గరకు తీసుకొని, "నీకీ పెరుగు ఎవరిచ్చార్రా?" అని అడిగారు. మురళి తలవంచుకొని "శ్యాముడిచ్చాడు" అని చెప్పాడు. ఆ తరువాత అయ్యవారు ఒక్కో ప్రశ్నా అడుగుతూ మురళి దగ్గర అసలు కథ మొత్తం





రాబట్టారు. ఆపైన ఆయన వాడి చెంపలు నిమిరి తలపైన ముద్దు పెట్టుకొని, "ఎంత అదృష్టవంతుడివిరా నాయనా! స్వయంగా శ్రీకృష్ణ భగవానుడే నీ విశ్వాసానికి లొంగి దర్శనమిచ్చాడు గదరా!" అన్నారు.

మురళి అమాయకంగా "నా కిష్ణుడు కనబడనే లేదయ్యగారూ! శ్యాముడే కనిపించాడు అన్నాడు. అయ్యవారు నవ్వి, "అతడే కృష్ణుడురా! కృష్ణుడెలా ఉంటాడో చెప్పు!" అన్నారు.

"కిష్ణుడా! నల్లగా ఉంటాడు, చేతిలో పిల్లనగోవుంటుంది. జుట్టేమో ...." మురళి ఆగిపోయాడు. అవును శ్యాముడు కూడా నల్లగా ఉన్నాడు. చేతిలో పిల్లనగ్రోవి వుంది. జుట్టుపైకి కట్టి ముడిలా ఉంది. ఆఁ!.... అవును .... అతను కిష్ణుడే. మురళికి హఠాత్తుగా స్ఫురించింది. "అయ్యవారూ! శ్యాముడి తల మీద నెమలి కన్ను కూడా ఉందండీ" అన్నాడు పెద్ద గొంతుతో హడావుడిగా. అయ్యవారు నవ్వి "అవున్నాయనా! అందుకే నువ్వు భాగ్యశాలివన్నాను. పాఠాలు చెప్పటంలో నేను నీకు గురువునైనా, పరమాత్మని చూడటం ఎలాగో నేర్పటంలో నువ్వే నాకు గురువ్వి అయినావు. నీకున్నంత గట్టి విశ్వాసం, దీక్ష నాక్కూడా యిమ్మని నీ కృష్ణుడితో చెప్పరా!" అన్నారు. ఆయన కళ్లలో కదులుతున్న నీటిచుక్కలు చూచి మురళి చలించిపోయాడు. మనసులోనే "క్రిష్ణా! ఎప్పుడన్నా అయ్యవారికి కూడా కనబడు క్రిష్ణా!" అనుకుంటూ అయ్యవారికి దగ్గరగా జరిగాడు. అంతలోనే అయ్యవారు తేరుకొని పిల్లల వైపు తిరిగారు.

"చూచారా! మురళి యివ్వాళ మనకు సాక్షాత్తూ ఆ బాలగోపాలుడి దగ్గర్నుంచే పెరుగు తెచ్చాడు - మనందరికీ దైవప్రసాదం దొరికింది. మరి మీరంతా తెచ్చిన పెరుగు గిన్నెలు అలా పక్కన పెట్టెయ్యండి - ఇంక బానలో ఖాళీ లేదుగా మరి! పదండి - మనమందరం కూడా మురళిలాగే శ్రద్ధతో, నమ్మకంతో పూజ చేసి ప్రార్థన చేద్దాం" అన్నారు. పిల్లలంతా మురళి వైపు గౌరవంగా, ప్రేమగా చూస్తూ అయ్యవారి వెనకే పూజ గదిలోకి కదిలారు.

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

(గత సంచిక తరువాయి)

ఇది స్వామీజీ దయార్ద్ర హృదయానికి, మూర్తీభవించిన మానవత్వానికి ఒక మచ్చుతునక మాత్రమే.

స్వామీజీ పనిచేసే శాంతి కాటన్ అండ్ సింథటిక్ మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించగా తాత్కాలిక ఉద్యోగులందరూ తమ ఉపాధి కోల్పోయారు. స్వామీజీ ఒకరి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడరని గ్రహించిన ముత్తయ్యగారు కొంత పైకం ఇచ్చి ఏదైనా వ్యాపారం చేసి భుక్తి గడుపుకోమనగా స్వామీజీ టోకు మార్కెట్టులో అరటి పళ్లను కొని గంపలో నెత్తిన పెట్టుకొని ఇంటింటికి తిరిగి అమ్మేవారు. వ్యాపార సరళి తెలియని స్వామీజీ లాభాలనార్జించకపోయినా గురువుగారు పెట్టిన పెట్టుబడి సహితం హరింపజేసారు. ఇది చూసిన ముత్తయ్యగారు స్వామీజీ వ్యాపారానికి పనికిరాడని ఇకముందు కూడా ఏ వ్యాపారం చేయవద్దని స్వామినాదేశించారు. గురువుగారి ఆదేశాన్ని పాటించి స్వామీజీ జీవితంలో మరల ఏ వ్యాపారం చేపట్టలేదు.

గురువుగారికి కలిగిన నష్టాన్ని భర్తీ చేయాలన్న తలంపుతో స్వామీజీ సియాన్ రైల్వేస్టేషన్‌లో కూలిగా పనిచేసి ఆ సంపాదనను గురువుగారికి సమర్పించెడివారు. స్వామీజీ నిజాయితీకి, కార్యదీక్షకు ముగ్ధులైన ముత్తయ్యగారు స్వామీజీకి తన వద్దనే ఆశ్రయం కల్పించారు. ప్రయాణీకుల సామాను మోసి ఇంతివ్వమని అడిగేవారు కాదు. వారిచ్చిన దానితోనే సంతోషపడేవారు. స్వామీజీ అమాయకత్వానికి ఇతర కూలీలు హేళన చేసినా స్వామీజీ నొచ్చుకునేవారు కాదు.

మానవ జన్మ యొక్క పరమార్థాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకున్న స్వామీజీ ఎల్లప్పుడు ఇతరులకు ఏ విధంగా సహాయపడగలనా అని తపన చెందెవారే గాని ఇతరుల సహాయాన్ని ఆశించేవారు కాదు. ప్రతి మానవుడు ఇదే విధంగా ఆలోచిస్తే ఇప్పుడు జరిగే కుట్రలు, కుతంత్రాలు, హింసాత్మక చర్యలకు తావులేక ఈ భువి దివికన్నా మిన్నగా ఉండును గదా! సియాన్ రైల్వేస్టేషన్ ప్రక్కన ఒక చిన్న వ్యాపారి త్రోపుడు బండి మీద అద్దాలు, దువ్వెనలు, పర్సులు మొ॥ చిన్న చిన్న వస్తువులను అమ్ముకొని జీవనాన్ని సాగించేవాడు. మధ్యాహ్న సమయంలో అతను భోజనానికి ఇంటికి వెళ్లినప్పుడు నిజాయితీపరుడు, పరుల సొమ్ము నాశించని వాడగు స్వామీజీకి బండినప్పగించి వెళ్లేవాడు. అతను భోజనం చేసి వచ్చిన తరువాత అప్పటి వరకు అమ్మకాల మీద వచ్చిన డబ్బులు, వస్తువులు సరిగా లెక్కచెప్పి అప్పగించేవారు స్వామీజీ. తన పని మానుకొని సహాయం చేసినందులకు స్వామీజీకి టీ ఇప్పించేవారు దుకాణుదారు. ఇద్దరు ఆత్మీయతతో కలిసిమెలసి ఉండేవారు.

ఇదే సమయంలో ముత్తయ్యగారు సుమారు ఆరు మాసములపాటు తమ స్వగ్రామం వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేసరికి స్వామీజీ చిక్కి శల్యమగుట గాంచి స్వామీజీని అడుగగా తన సంపాదన భోజనానికి చాలకపోవటంతో బన్ తిని, టీ త్రాగి కాలం గడిపినట్లు స్వామీజీ సెలవిచ్చారు. “ఇంట్లో వంటసామానులన్నీ ఉండగా ఎందుకు వంట చేసుకోలేద”ని ప్రశ్నించగా “మీరు లేని సమయంలో మీ సామానులు వాడుకుంటే అది చోరత్వమే” అవుతుంది గదా అందుకనే తాను ఆ సామానులు వాడుకోలేదని వినయంగా సమాధానమిచ్చారు స్వామీజీ. ఈ సమాధానం విన్న ముత్తయ్యగారు ప్రతి వ్యక్తి పైసల కోసం ప్రాకులాడుతుంటే, పరుల సొత్తుని విష సమానంగా భావించే ఇతను కారణజన్ముడని నిర్ధారించుకొని, స్వామితో “నీవు నమ్మిన ఈ సిద్ధాంతాన్ని ఏనాడు వీడకు అదే నీకు శ్రీరామరక్ష”యని ఆశీర్వదించి ఆర్తితో ఆలింగనం చేసుకున్నారు.

జీవితాంతం వరకు గురువాజ్ఞను త్రికరణశుద్ధిగా పాటించి తనకు ఎంత దక్షిణ వచ్చినాగానీ తన స్వంతానికి వాడుకోకపోవుటయేగాక మరునాటికి కూడ పదిలపరుచుకోకుండా దక్షిణ ధనాన్నంతా సాయి సేవకు, సాయి భక్తుల కొరకే వినియోగించిన సేవా తత్పరులు స్వామీజీ. ఇటువంటి సుగుణాల గని తన శిష్యుడుగా లభించినందుకు వారిని కన్న తల్లిదండ్రులకు తన శిష్యునిగా చేసిన ఆ దైవానికి కృతజ్ఞతలు తెల్పుకున్నారు ముత్తయ్యగారు.

స్వామీజీకి గురువుయందు అత్యంత శ్రద్ధాభక్తులుండబట్టే ఆయన జీవితంలో అత్యధిక భాగం సద్గురువులకే సద్గురువైన సాయి చరణ సేవలో గడిపే అదృష్టం కల్గింది. గురువుని త్రిమూర్తి స్వరూపుడని విశ్వసించటం వలననే తమ ఏడు దశాబ్దాల జీవితకాలంలో నాలుగున్నర దశాబ్దాలు స్వామి సేవలందుకున్నారు సాయిబాబా. గురువునేవిధంగా సేవించాలో తెలుసుకోవటానికి స్వామీజీ జీవితమే ఉత్తమమైన ఉదాహరణ. స్వామీజీకి ఇష్టము లేకున్నను అసంఖ్యాక భక్తులు గౌరవపూర్వకంగా **"గురుదేవ్"** అని సంబోధించేవారు.

సియాన్ రైల్వేస్టేషన్ ప్రక్కనే బీద కుటుంబానికి చెందిన ఒక యువతి కూలి పని చేసుకుంటూ జీవనోపాధి సాగించేది. ఆమె చూడచక్కని అందగత్తె. ఆమె అందానికి అవధులు లేవు. ఆమె సొగసులకు అందరు దాసోహమనేవారు. ఆమెతో ఒక్కసారి మాట్లాడితే చాలు జీవితం ధన్యమవుతుందని తలచేవారు. ఏదో ఒక సాకుతో ఆమెతో మాట్లాడటానికి ప్రయత్నించేవారు కొందరు. కాగ ఆమె అందచందాలను కళ్ళతోనే ఆస్వాదించేవారు మరికొందరు. ఆ యువతి వీరిని పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోయేది. కొంతకాలం తరువాత ఆమెకు మసూచి సోకి అందవిహీనంగా తయారై ముఖమంతా మచ్చలు పడటమే గాక కనుచూపు కూడా కోల్పోయి అంధురాలైనది. అప్పటివరకు ఆమె అంద





చందాలను చూసి రంభ, ఊర్వశి అని పొగడిన వారే ఆమె అందం హరించుకుపోగానే ఆమెను ఈసడించుకోసాగారు. ఆమె తల్లిదండ్రులు సహితం ఆమెను ఇంటి నుండి వెలివేసారు. బ్రతుకుతెరువు లేక ఆమె చివరకు బిచ్చగత్తెగా మారింది. విధి విలాసమంటే ఇదే గదా! ఇదంతా గాంచిన స్వామీజీ వికలిత మనస్కులై ఈ విషయమే పదేపదే ఆలోచించి బాహ్య సౌందర్యం శాశ్వతం కాదనియు అంతఃసౌందర్యమే శాశ్వతమైనదని ఈ మానవ శరీరం అనేక పరిణామాలు చెంది చివరకు భస్మమౌతుం దనియు, పది మందికి మేలు చేసి వారి హృదయంలో స్థానం సంపాదించుకుంటే అది కలకాలం పదిలంగా ఉంటుందని గ్రహించి తనకు చేతనైనంత వరకు నలుగురికి సహాయపడేవారు మన స్వామీజీ. మానవ శరీరం ఏ క్షణంలో ఏమౌతుందో, ఏ మార్పులు చెందుతుందో ఎవ్వరికి అంతుచిక్కని రహస్యం అని గ్రహించిన స్వామీజీ శరీర సౌందర్యానికి ఏనాడు ప్రాధాన్యతనిచ్చేవారు కాదు.

ఏ మాత్రం తీరికచిక్కినా భారత, భాగవత, రామాయణాది పురాణ గ్రంథాలను శ్రద్ధగా పారాయణ చేస్తూ వాటిలోని నీతిని ఔపోసన పట్టటమే గాక వాటిని త్రికరణ శుద్ధిగా ఆచరించేవారు. గురువుగారినడిగి ఎప్పటికప్పుడు సందేహనివృత్తి చేసుకొనెడివారు. గురువుగారి సలహాపై ఎక్కువ సమయాన్ని ధ్యానానికి కేటాయించేవారు.

నిత్యానంద స్వామీజీ దర్శనార్థం బొంబాయి నుండి గణేష్‌పురికి కాలి నడకన వెళ్ళారు మన స్వామీజీ. మఠంలో కుండం దగ్గర కాళ్ళు కడుక్కొని ఆశ్రమంలోనికి ప్రవేశిస్తుండగా నిత్యానంద స్వామీజీ మన స్వామికి ఎదురు వచ్చారు. స్వామీజీ ఆశ్రమంలోనికి వెళ్ళి చూడగా అచట నిత్యానంద స్వామీజీ పీఠం మీద ఆశీనులై ఉన్నారు. ఒకే సమయంలో ఒకే వ్యక్తి రెండు వేర్వేరు ప్రదేశాలలో దర్శనమిచ్చిన వైనంతో నిత్యానందుల వారు మహిమాన్వితులని గ్రహించారు మన స్వామీజీ. **(సశేషం)**

# ఎన్నికల వేళ

మనం విజ్ఞత చూపించవలసిన సమయమిది. మన భారతదేశం ఒక మలుపు తిరగబోతోంది. ఈ సమయంలో మనం మడికట్టుకొని కూర్చోక మంచి మలుపు కొరకు తప్పనిసరిగా ప్రయత్నం చేయవలసిన సమయం. మొదటి ప్రయత్నంగా మనమందరం ఓటు హక్కును వినియోగించు కుందాం. అందరూ గూడా వారివారి ఓటుహక్కును వినియోగించు కొనేలా ప్రయత్నం చేద్దాం - నమస్కారం.

- మండువ రంగారావు

ఆ.వె॥ ఓటు నోటు కాదు ఒక్కటి యెపుడైన
ఓటు వేయవలదు నోటు కొరకు
ఓటు విలువ నెఱిగి ఒద్దికగావాడు
తెలసి నడువుమయ్య తెలుగు వీర।

ఓటు అడుగ వచ్చి ఒడిబియ్య మిస్తాము
ఓటు వేయు మనుచు నోటు జూపు
ఓటు వేయు కొఱకు ఓణీలు యిత్తురు
తెలసి నడువుమయ్య తెలుగు వీర !

నీకు తెలిసినోళ్లు నీ చుట్టుపక్కాలు
చుట్ట మితడు యనుచు చుట్టుజేరి
మనది కులమంచు మతలబు జేస్తారు
తెలసి నడువుమయ్య తెలుగు వీర !

ఓటు వేయు వేళ ఓరిమి వహియించి
వాని ఘణత నెఱిగి వాక్కు శుద్ధి





నెఱిగి దేశ భవిత నెఱిగిన తరువాత
తెలసి నడువుమయ్య తెలుగు వీర !

తే.గీ॥ చీర జాకెట్టు యివ్వగా చిత్తు గాక
పంచల జత నీకనగనె పట్టు బడుకు
పసుపు కుంకుమలన్నియు పలుపు తాడు
తెలిసి వేయుము నీవోటు తెలివిగలిగి !

కం॥ వేదిక లెక్కుచు భాషణ
వాదన బహు గొప్పగాను వాక్చతురతతో
అదిజేతు నిదియుజేతును
పదపదమని ఓటు నాకు పడవలె నందుర్ !

ఆ.వె॥ మోసపోకు మోయి మోహంపు మాటకు
కాని మాటలన్ని కట్టిపెట్టి
మనిషితత్వ మెఱిగి మర్యాద తీరుగా
మెలగు వాని కోటు మేలు వేయ !

నన్ను మించి యెవడు నడయాడ గలవాడు
అనుచు పొగడు కొనెడు అల్పజనుడు
వారు నాకు తెలుసు వాడ లందున యను
కోత రాయు నెపుడు కోరుకోకు !

ఓడి పోకు మోయి ఓటు వేసెడివేళ
ఓటి మోత కీపు ఒఱిగిపోకు
గట్టి నిర్ణయంబు గమ్యంబు నెఱుగుచు
భవిత గూర్చువాని పంపు నటకు !

ఏడు పదుల రెండు ఏడులు ఏడ్చాము

చేత కాని వారి జేసి రాజు
కనులు తెఱచి ఓటు కాంక్షించి వైభవ
భరత మాత కొఱకు భాసి కొఱకు ।
నీదు పిల్లజెలల నీ గొడ్డు గోదము
చల్ల గుండ వలెను చావ రాదు
చూచి ఓటు వేయ సూదంటు వానికి
నీకు సుఖము కలుగు నిత్య మిదియ ।

జనుల మేలు కోరి పనులు చేసెడివాని
దేశ క్షేమ మఱచి దేహ మిచ్చు !
మాన ప్రాణ రక్ష మర్యాద కాపాడు
వాని నెన్ను కొనగ వలయు నయ్య ।



## శ్రీరామ నవమి కళ్యాణ మహోత్సవ సంకీర్తనము

- కే.శే. సాయి మామ్మగారు

సీ॥ వడపప్పు మిరియాల పానకంబుల తోడ
చలివేంద్రములు కడు సందడించ
భజనలు హరికథల్ భక్త బృందాలతో
పగలు రాత్రులు గొప్ప సొగసులీన,
ప్రతి ఇంట రామయ్య ప్రతి యింట సీతమ్మ
క్రొత్త దంపతులౌచు కొలువుదీర,





ప్రతి గుండె హనుమకు ప్రతిరూపమ్మై, రామ
దండుగ జగముల నిండుచుండ,
తే.గీ. చైత్రమాసంబు సరికొత్త చలువలీన
భక్తి సామ్రాజ్య - విస్తార భావములకు
మూలమై - రామకల్యాణములు వెలుంగ,
గ్రామగ్రామాన - జరుగు శ్రీరామనవమి!
శ్రీ సీతారామచంద్రమూర్తి కీ జై !!!

## -: అన్నమాచార్య కీర్తన :-

రామచంద్రుడితడూ - రఘు వీరుడూ ॥
కోరిన వరమూ లియ్యా - గలిగే నందరికీ ॥
1. గౌతమ భార్యా పాలిట - కామధేను వితడూ
ఘాతుక కౌశికు పాలీ - కల్ప వృక్షమూ
సీతాదేవీ పాలీ - చింతామణి యితడూ
యీతడు దాసుల పాలిటి - ఇహపర దైవమూ ॥
2. పరగ సుగ్రీవ పాలి - పరమ బంధువితడూ
నిరతి విభీషణుని పాలీ - నిదానమూ
సరిహనుమంతూ పాలీ - సామ్రాజ్యమూ
గరిమ జనకుని పాలీ - ఘన పారిజాతమూ ॥
3. తలప శబరీ పాలీ - తత్త్వపు రహస్యమూ
అలరి గుహుని పాలీ ఆది మూలమూ
కలడన్న వారి పాలి - కన్నులెదుటి మూర్తి
వెలయ శ్రీ వేంకటాద్రి - విభుడీతడూ !
సాయిరామ చంద్రుడితడూ - రఘువీరుడూ !

# మాతృసంస్థ కబుర్లు

మార్చి 4వ తేదీ మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా దేశమంతా ఉపవాసాలు ఉండటం, శివరాత్రి జాగరణ చేయడం భారతీయ సంప్రదాయంగా వస్తున్నది. శివుడు అంటే శుభంకరుడు. మనం జరుపుకునే ప్రతీ పండుగకీ ఓ విశేషం ఉంటుంది. అలాగే శివరాత్రి పండుగ నిర్మలత్వానికీ, వైరాగ్య భావనకి గుర్తు.

శివరాత్రి పర్వదినాన సాయిధామం ద్వారవతి సాయి దేవాలయంలో శివ సాయినాథుల వారికి, దత్తాత్రేయుల వారికి ఉదయం గం.6.00లకు క్షీర, జలాభిషేకాలు, నమకం, చమకం, రుద్రంతో చక్కగా జరిగాయి. ఆశ్రమవాసులందరూ ఉపవాసాలు ఉండి భజనలు, శివనామాలను పఠిస్తూ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాయంత్రం గం.7.00ల నుండి దేవాలయంలో శివస్తుతి, లింగాష్టకం, శివపంచాక్షరి, చంద్రశేఖరాష్టకం మొదలైన స్తోత్రాలు భక్తితో పఠించి తరించారు. భక్తులంతా సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే ఎదుట నిలిచాడా అన్నంత తన్మయత్వం చెందారు.

అనంతరం సాయిరామ చైతన్యగారు శివతత్వాన్ని గూర్చి భక్తులనుద్దేశించి ప్రవచించారు. అర్ధరాత్రి గం.12.00లకు లింగోద్భవ వేళ శివలింగానికి పంచామృతాభిషేకం, మహామృత్యుంజయ మంత్రంతో సాగింది. అనంతరం శివపూజ తీర్థ వితరణ జరిగింది.

మార్చి 13వ తేది తిరుపతి శ్రీనివాస మంగాపురంలోని వశిష్ఠాశ్రమ వ్యవస్థాపకులైన శ్రీశ్రీశ్రీ స్వామీ స్వరూపానందరాజుగారు సాయిధామం సందర్శనం చేయడం జరిగింది.

వారు ఆశ్రమాన్నీ, ఆశ్రమ సేవా కార్యక్రమాలను తెలుసుకొని





పరమానందభరితులయ్యారు.

వేద విద్యలను, ఆధ్యాత్మికతను, దేవాలయ పద్ధతులను, పూజలను జనం మర్చిపోతున్నారు. వాటన్నింటినీ మళ్లీ చైతన్యవంతం చేసి ధర్మస్థాపన చెయ్యాలనే ఉద్దేశ్యంతో పేద పిల్లలకు నేర్చుకునే అవకాశం కోసం స్వామీజీ ఎంతో కృషి చేస్తున్నారని స్వామీజీ గురించి శ్రీ సాయిరామ చైతన్యగారు సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థులకు వివరించారు.

శ్రీ స్వరూపానంద గిరి మహారాజు వారు పాఠశాల విద్యార్థులకు చదువు-సంస్కారం గూర్చి చెప్పారు. విద్యార్థికి చదువు సంస్కారం ఎంతో ముఖ్యమని బోధించారు. మన గురువులు చెప్పింది నేర్చుకుంటే అదే జీవితాలకు ఎంతో వెలుగునిస్తుందని వివరించారు. ప్రకృతిలో మనకు లభించే చెట్లు, నదులు-ఇవన్నీ ఎంతో ఉపకారం చేస్తున్నాయి. వాటి కోసం అవి బ్రతకడం లేదు. ఇతరుల కోసమే జీవిస్తున్నాయి. అపకారానికి కూడా ఉపకారం చెయ్యగలవి ఇవి. కానీ మనిషి మాత్రం వాటిని మరచి స్వార్థంతో జీవిస్తున్నాడు. అందుకని మీరందరూ ఏం చెయ్యాలంటే యీ ఆశ్రమంలో ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. మీరు పెద్ద వాళ్ళు అయ్యాక పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తారు. మన అభివృద్ధికి కారణమైన సంస్థగాని, వ్యక్తులనుగాని మనం మరువకూడదు. మనం నిజంగా భగవంతుడి అనుగ్రహం పొందాలంటే మనం ఎక్కడ ఉపకారాన్ని పొందామో అక్కడ ప్రత్యుపకారం చెయ్యడం మర్చిపోతామో దాన్ని కృతఘ్నత అంటారు. చేసిన మేలును గుర్తు పెట్టుకుని మళ్లీ ఉపకారం చేసేదాన్ని కృతజ్ఞత అంటారు. కాబట్టి మీరందరూ జ్ఞానాన్ని, సంస్కారాన్ని అందించిన ఈ మాతృసంస్థని ఎప్పుడూ మరువకూడదని బోధించారు.

మార్చి 16వ తేదీ శ్రీ రామకృష్ణా మఠం హైదరాబాద్ స్వామీజీ శ్రీశ్రీశ్రీ శితికంఠానంద మహారాజ్‌వారు విచ్చేసారు. పచ్చని ప్రకృతి ఒడిలో ప్రశాంత

వాతావరణంలో విద్యను అభ్యసిస్తున్న మీరందరూ చాలా అదృష్టవంతులని పాఠశాల విద్యార్థులనుద్దేశించి అన్నారు. బయట వాతావరణం కాలుష్యంతో, మనుష్యుల స్వార్థ జీవనంతో గడుపుతున్న నేటి సమాజంలో మీరు ఎంతో పుణ్యాత్ములని ఆశీర్వదించారు. ఇలాంటి ఆశ్రమ వాతావరణంలోనే దైవీ సంస్కారాలనేవీ వస్తాయని చెప్పారు. స్వామి వివేకానందగారికి ఒక ప్రశ్న ఉండేది. "భగవంతుడనేవాడు ఉన్నాడా! ఎక్కడ ఉంటాడు అని. ఎందుకు వచ్చిందంటే దుఃఖం వచ్చింది. ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, సమాజ పరిస్థితులు ఎన్నో వచ్చాయి. దీంతో భగవంతుడు దుఃఖపూరితమైన ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు. స్వార్థ పూరిత మనుషులను ఎందుకు సృష్టించాడు. పరిపూర్ణ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించలేకపోయాడు అనే జిజ్ఞాస ఎక్కువైపోయింది. అలాగే విద్యార్థులకు కూడా తెలుసుకోవాలనే కోరిక ఉండాలి. పుస్తకాలలో ఉన్నది బట్టీపట్టడం కాకుండా ఆలోచన, జిజ్ఞాస, సృజనాత్మకత ఉండాలని వివరించారు.

స్వామి వివేకానంద సింహ హృదయం మీద ధ్యానం చెయ్యాలన్నారు. మన పిరికితనం పోయి ధైర్యవంతులం కావాలంటే ఇది చక్కని మార్గం. ఎక్కడ ధైర్యంగా ఉంటామో అక్కడ విజయం మనదే అవుతుంది. కాబట్టి అందరూ అలా ఉండాలనీ ఆ భగవంతుడిని మనసారా వేడుకుందాం అని ముగించారు.

### సత్తెన పల్లి శాఖలో

ఫిబ్రవరి 21వ తేదీ ఆశ్రమంలో పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి '80వ' జయంతోత్సవాన్ని పురస్కరించుకొని గురుదేవులకు జ్ఞానధామం-3 (ధ్యాన మందిరం) నిర్మించాలని శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్ వారు నిర్ణయించారు.

19వ తేదీ మధ్యాహ్నానికి శ్రీ సాయిరామ చైతన్యగారు, శ్రీ ఆనందం





మామయ్యగారు, సాయిచంద్ర ఆశ్రమానికి చేరుకున్నారు. 20వ తేదీ జ్ఞాన మందిరం శంకుస్థాపనకి కావలసిన ఏర్పాట్ల కోసం శ్రీ సాయిరామ చైతన్యగారు జె.సి.బి.తో బాబా వారి మందిరం ముందు మట్టి తీయించారు. హోమం చేయడానికి హోమగుండం తయారుచేయించారు. 20వ తేదీ గం.11.00లకు హైదరాబాదు నుండి ట్రస్ట్ సభ్యులు శ్రీ రామ్మోహన్ రావుగారు మరుసటి రోజు జరుగబోయే శంకుస్థాపన, వాస్తు హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి సుబ్రహ్మణ్య శర్మగారిని తీసుకొని వచ్చారు, అదే సమయానికి గురుదేవుల శిష్యులు శ్రీ చంద్రారెడ్డిగారు, శ్రీ లక్ష్మణరావుగారు, డా॥ ఝాన్సీగారు ఆశ్రమ పరిచయస్తులు, రాత్రికి తెనాలి నుండి శ్రీ గోపి, వారి కుటుంబసభ్యులు రావటంతో ఆశ్రమంలో సందడి మొదలైనది. ఒకప్రక్క 21వ తేదీ కార్యక్రమానికి టెంట్లు వేయడం, అన్నప్రసాదం చేయడానికి వంటకి కావలసిన ఏర్పాట్లు, అలంకరణ కార్యక్రమాలు పూర్తయినవి.

21వ తేదీ గురువారం ఉదయం 5.15 ని.లకు ఆనందసాయి ప్రభు వారికి కాకడ హారతి అనంతరం అభిషేక, పూజా కార్యక్రమాలు జరిగినవి. గం.6.30 ని.ల నుండి శ్రీ సుబ్రహ్మణ్య శర్మగారి ఆధ్వర్యంలో గణపతి పూజ, 8.08 ని.లకు ఉత్తర ఫల్గుణి నక్షత్ర పుష్కరాంశమందు శంకుస్థాపన కార్యక్రమం ఆశ్రమ ధర్మాధికారి శ్రీ సాయిరామ చైతన్యగారిచే జరిగినది. అందరమూ గురుదేవులకు నమస్కరించి నవధాన్యాలు, నవరత్నాలు సమర్పించాము. అనంతరం శ్రీ సాయిరామ చైతన్యగారు, శ్రీ కట్టా కృష్ణ మూర్తి, నాగేంద్రమ్మ దంపతులు, శ్రీ సోలంకి మల్లేశ్వర ప్రసాద్, నాగ మల్లేశ్వరి దంపతులు, శ్రీ గోపి, సాయిమాధురి దంపతులచే వాస్తు హోమం నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో సంకల్పం చెప్పిన తరువాత పరమపూజ్య గురుదేవులు పటం మీద పెట్టిన పువ్వు పడటం విశేషం. వారి ఆశీస్సులు మాకందజేసారని అందరమూ ఆనందించాము.

హోమం జరిగేటప్పుడు హోమజ్వాలలో కోదండం పట్టిన రాముల వారి స్వరూపం దర్శనమివ్వడం మరొక విశేషం. ఈ ఆశ్రమ ప్రాంగణంలో దైవశక్తి ఉన్నదని, ఇదొక పవిత్రక్షేత్రం అని గురుదేవుల చెప్పినట్లు మరొకసారి నిరూపితమైనది. పూర్ణాహుతి జరిగే సమయానికి పరిసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ప్రైమరీ స్కూలు నుండి దాదాపుగా 700 మంది పిల్లలు ఒక్కసారిగా రావటంతో ఆశ్రమమంతా చదువుకొనే బాలబాలికలతో కళకళలాడింది. పరమపూజ్య గురుదేవులకు పిల్లలన్న అమితమైన ప్రేమ చూపించేవారు. అందుకనీ ఇంతమంది పిల్లలు వచ్చారని ఆనందించారు. మహాహారతి పూర్తయ్యే సమయానికి ఆశ్రమ పరిసరాలలో ఉన్న భక్తులందరూ అన్నప్రసాదం స్వీకరించడానికి తరలివచ్చారు. అందరికీ ఎటువంటి ఆటంకం కలుగకుండా అన్నప్రసాదం అందించడంలో సహకరించిన కుర్రవాళ్ళు, పెద్దలు, పిన్నలకు, ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారికి గురుదేవుల ఆశీస్సులు. దాదాపుగా 2 గంటల వరకు 1700 మందికి అన్నప్రసాద వితరణ ప్రశాంతంగా జరిగినది. కార్యక్రమం ఆద్యంతం పూజ్య మాతాజీ అంతర్లీనంగా ముందుకు నడిపించారని మా మనసుకు అనిపిస్తున్నది. గురుదేవుల మందిరం నిర్మించడం వారి ఆకాంక్ష, అది నెరవేరడం, వారి ఆశీస్సులతో కార్యక్రమం సంపూర్ణమవటం మాకెంతో ఆనందం కలిగినది.

మార్చి 9వ తేదీ ఆశ్రమానికి దగ్గరగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న 700 మంది పిల్లలకు సాయంత్రం గం.4.00లకు శ్రీ సాయిరామ చైతన్యగారు చదువు యొక్క ఆవశ్యకత, లక్ష్యసాధన, గురువుల పట్ల, తల్లిదండ్రుల పట్ల గౌరవం, సంస్కారం, మానవతా విలువల గురించి ఉదాహరణ కథలతో ప్రవచించారు. విద్యార్థినీ విద్యార్థులు శ్రద్ధగా ఆలకించారు. ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్‌గారు మంచి సందేశాత్మక ప్రవచనమిచ్చారని కృతజ్ఞత తెలియజెప్పారు.





# భగవన్నామ మహిమ

పూర్వం ఒక ఊళ్ళో ఒక పెద్ద దేవాలయం ఉండేది. ఆ దేవాలయం ముందు కొందరు భక్తులు దేవుడి మీద పాటలు పాడుతూ, నామ సంకీర్తనం చేస్తూ, భక్తి పారవశ్యంలో భజన చేస్తూ ఉండేవారు.

దేవుడిపై నమ్మకం లేని యువకుడు ఒకడు ఒకనాడు దేవాలయం ముందుగా పోతూ ఆ భక్తులను చూసి "ఇలా గొంతు చించుకొంటూ అరుస్తారెందుకు? దీనివల్ల మీకు ఒరిగేదేమిటి?" అంటూ పరిహాసం చేశాడు.

ఆ మాటలు విన్న భక్తులలో ఒక వ్యక్తి ఈ యువకుణ్ణి సమీపించి ఇలా అన్నాడు : "నాయనా! భగవంతుడి దివ్యనామం ఎంతో మహిమ గలది. ఆ నామాన్ని పరిహసించకూడదు. భగవంతుడికంటే భగవన్నామమే ఉన్నతమైనది. భక్తితో ఆ నామజపం చేసే వారికి సకల కార్యాలూ సానుకూలమవుతాయి".

మన యువకుడు ఆ భక్తుణ్ణి చూసి మళ్ళీ ఎగతాళిగా ఇలా అడిగాడు: "అయ్యా! భగవన్నామ జపంతో సకల కార్యాలూ సానుకూలపడతాయి అని గదా మీరు సెలవిస్తున్నది. నామజపం చేస్తూ కూర్చుంటే భోజనం లభిస్తుందా?"

అందుకా భక్తుడు "దాన్లో సందేహం లేదు బాబూ! విశ్వాసంతో భగవన్నామం జపిస్తూ కూర్చుంటే భోజనం లభించడమే కాదు, ఆ భగవంతుడే సాక్షాత్తు అరుదెంచి నోటికి అందిస్తాడు" అని కృతనిశ్చయంగా జవాబిచ్చాడు.

ఈ మాటలు ఆ యువకుణ్ణి కాస్త యోచింపచేశాయి. భక్తుడు అన్న పలుకుల్లోని నిజానిజాలు పరీక్షించదలుచుకొన్నాడు ఆ యువకుడు.

వెంటనే సమీపారణ్యంలోనికి హుటాహుటిన ప్రవేశించాడు. అరణ్యం మధ్యకు వెళ్ళి ఆకులతో కొమ్మలతో గుబురుగా వున్న ఒక చెట్టును చూశాడు. ఆ చెట్టు నీడన పడుకొంటే దారినపోయేవారు దయదలచి అన్నం పెట్టే అవకాశం ఉందని, ఎవరికీ కనిపించరాదని ఆ చెట్టెక్కి ధీమాగా కూర్చున్నాడు. "ఆ భగవంతుడు ఇప్పుడెలా అన్నం తినిపిస్తాడో నేను చూస్తాను" అనుకొంటూ నామజపం చేయసాగాడు.

ఈ రకంగా రెండురోజులు గడిచిపోయాయి. మూడవ రోజు ఆ చెట్టు కేసి ఒక బాటసారి వచ్చాడు. చెట్టు నీడన కూర్చుని తను తెచ్చుకొన్న మూట నుండి కొంత భాగం అన్నం తిని మిగిలిన అన్నం మూటగట్టి చెట్టు నీడన పడుకొని చల్లగా నిద్రలోనికి జారుకొన్నాడు. మంచి నిద్రలో ఉండగా, గాండ్రిస్తూ ఒక పులి తనపైన పడుతూన్నట్లు అతడు కలగన్నాడు. మేల్కొని, కల నిజమే అనుకొని భయంతో అన్నం మూటను అక్కడే వదిలేసి పారిపోయాడు.

ఆ బాటసారి పారిపోయిన కాస్సేపటికి కొందరు దొంగలు ఆ చెట్టు వద్దకు రావడం తటస్థించింది. ఆ చెట్టు నీడన కూర్చుని తాము దోచుకొచ్చిన ధనాన్ని సొమ్ములను పంచుకోసాగారు. అప్పుడు వారిలో ఒకడి కంటబడింది ఆ అన్నం మూట. ఆ దొంగలందరూ నిజానికి అప్పుడు ఆకలితో నకనకలాడుతున్నారు. తలాకాస్త ఆ అన్నాన్ని తిందామనుకొని మూటను విప్పారు.

ఏదో స్ఫురించిన వాడిలా దొంగల నాయకుడు వారి ప్రయత్నాన్ని వారించి ఇలా అన్నాడు : "ఈ నిర్జనారణ్యంలో అన్నం మూట ఇలా చెట్టు





నీడన విడిచి వెళ్ళడంలో ఉద్దేశం ఏమిటి? చూడబోతే మనలను చంపాలనే ఉద్దేశంతో ఎవరో విషం కలిపిన అన్నం తెచ్చిపెట్టి ఉంటారు. ఆ వ్యక్తి ఎవడో ఈ ప్రాంతానే పొంచి ఉంటాడు. అతగాణ్ణి వెతికి పట్టుకోండి".

నాయకుడి ఆజ్ఞ మేరకు దొంగలు అన్నివైపులా గాలించి చివరకు చెట్టు మీద కూర్చున్న మన యువకుణ్ణి పట్టుకొని బలవంతంగా కిందికి దింపారు.

దొంగల నాయకుడు ఆ యువకుణ్ణి ఎగాదిగా చూసి, ఇలా అన్నాడు: "నా సందేహం నిజమే అయింది. మనలను చంపడానికి పథకం వేసింది ఇతగాడే. వీడిని వదలకూడదు. మూటలో ఉన్న అన్నం వీడిచేతనే తినిపించండి".

దొంగలు యువకుణ్ణి మర్యాదగా అన్నం తినమన్నారు. కాని భగవన్నామాన్ని పరీక్షించే ఉద్దేశంతో ఉన్న మన యువకుడు అన్నం తినడానికి నిరాకరించాడు. దాంతో దొంగల సందేహం రూఢి అయింది. అప్పుడు దొంగలు బలవంతంగా యువకుడి నోరు తెరిచి అన్నం ముద్దలు నోట్లోకి నెట్టి, అతడిచేత తినిపించారు.

ఈ సంఘటనతో యువకుడిలో చక్కటి పరివర్తన వచ్చింది. దేవాలయం వద్ద భక్తుడు చెప్పింది అక్షరాలా నిజమవడంతో యువకుడికి భగవంతునిపై నమ్మకం కలిగింది. భగవంతుడు అనుగ్రహించి తనకు అన్నం తినిపించినందుకు అతడి కళ్ళవెంట ఆనందాశ్రువులు వర్షించాయి. ఆనాటి నుండి ఆ యువకుడు భక్తసమాజంలో చేరిపోయి తానూ భగవన్నామం చేయసాగాడు.

# శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం ఆశ్రమంలో జ్ఞానధామం-3 నిర్మాణం

**సాయిధామం సేవాశ్రమ అనుబంధ శాఖగా శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం పేరిట గుంటూరు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని అబ్బూరు రోడ్డు 30వ వార్డు, రైల్వేగేటు దగ్గర ఈ ఆశ్రమం ఉన్నది. ధర్మ ప్రచార కేంద్రంగా, పరిసర గ్రామాల ప్రజలకు సేవలందించాలనీ, ప్రజలను దైవభక్తి, దేశభక్తి పరాయణులుగా తీర్చిదిద్దాలని పూజ్య గురుదేవుల సంకల్పం. వారి ఆశయాల మేరకు నడుస్తున్నది శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమం. పూజ్య గురుదేవులు ఈ ఆశ్రమ నిర్మాణంకోసం ఎంతో శ్రమించి తపించారు. చీకట్లో తడుముకుంటూ తిరిగే మన జీవితాలకు జ్ఞాన వాకిళ్లు తెరిచిన ప్రేమమూర్తి పరమ పూజ్యులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు. సాయి సాయుధ్యం పొందిన పూజ్య గురుదేవులకు శ్రీ కోదండ రామసాయి సన్నిధానం ఆశ్రమంలో జ్ఞానధామం-3 (ధ్యాన మందిరం) పేరిట ఒక చిన్న మందిరం నిర్మించాలని గ్రామ ప్రజలు మరియు సాయి సేవా సమితి ట్రస్ట్ వారి నిర్ణయం మేరకు దాని నిర్మాణం ప్రారంభమైనది. (ఫిబ్రవరి 21, 2019న శంకుస్థాపన జరిగింది)**

**(నిర్మాణ వ్యయం సుమారు రూ.6 లక్షలు.)**

ప్రియ మిత్రులారా!

సమాజసేవకు కేంద్రంగా ఉండబోతున్న ఈ నిర్మాణ మహత్కార్యంలో పాలుపంచుకోవలసిందిగా సహృదయులు, సేవాపరులు, దైవభక్తులను మనఃపూర్వకంగా ఆహ్వానిస్తున్నాం, ధన రూపంలో కానీ, వస్తురూపంలోకాని మీకు చేతనైనా విరాళాలను అందించవచ్చు.

**వివరాలకు :** చెక్కులు **Sri Sai Seva Samithi Trust** పేరిట పంపించవచ్చు. డొనేషన్స్ ఆన్‌లైన్ ద్వారా కూడా పంపించవచ్చు.

అకౌంట్ పేరు - **Sri Sai Seva Samithi Trust**

అకౌంట్ నెంబరు - **62002652136**

**IFSC Code - SBIN0020639**

**SBI Keesara Branch**

మీరు డొనేషన్ పంపిన తరువాత మాకు మీ వివరాలు తెలియజేయడానికి ఫోన్ నెం : **9440413455, 9848133565** లను సంప్రదించగలరు.

ప్రియ మిత్రులారా! కదలి రండి!! కలిసి రండి!!! చేయి విప్పి మీ సహకారం అందించండి. శ్రీ సాయిసేవలో పునీతులు కండి.

ఇట్లు

**సాయి సేవలో**

**ధర్మాధికారి**

**శ్రీ సాయి రామ చైతన్య**

**సాయి సేవా సమితి ట్రస్ట్,**

**సాయిధామం**

# బాలవాణి

అనగనగా ఒక సాధువున్నాడు. ఆయన చిన్ననాటి నుంచీ ఎంతో మంచి శిక్షణలో పెరిగాడు. పెద్దవాడయ్యాక ఒక గురువుగారి దగ్గర భగవంతుడంటే ఏమిటో తెలుసుకొని, సన్యాసం తీసుకున్నాడు. ఒకసారి ఆయన ఒంటరిగా అడవిదారిన ప్రయాణం చేస్తూ ఉన్నాడు.

“శ్రీరామ జయరామ జయ జయరామ” అంటూ దైవ నామస్మరణ చేస్తూ నడుస్తున్నాడు. నట్టడవిలోకి వచ్చేటప్పటికి మధ్యాహ్నమైంది. ఎండ వేడికి తాళలేక సాధువు త్రోవలో కన్పించిన ఒక కొండ గుహలోకి వెళ్ళి కూర్చున్నాడు. మిటమిటలాడే ఎండలో నుంచి ఒకేసారి చీకటిగుహలోకి వెళ్ళేసరికి కళ్లు అలుక్కుపోయినట్లై, సాధువుకు ఆ గుహలో ఏముందో కన్పించలేదు. నాలుగైదు నిముషాలపాటు కళ్లు మూసుకు కూర్చున్నాక చుట్టూ పరికించి చూచాడతడు. ఒక మూలగా రాసులు పోసి ఉన్న రత్నాలు, వజ్రాలు, వెండి నాణేలు, బంగారు నగలు సాధువు కంటబడ్డాయి. అంతే! ఒక్క ఉదుటున లేచి, “అమ్మో! అమ్మో! మృత్యువు మృత్యువు” అంటూ గుహ బయటకు పరుగెత్తాడాయన. సాధువు తల్లిగారు చిన్నప్పటి నుంచీ చెప్తుండేది. “మనది కాని సొమ్ము పాము వంటిది. కష్టార్జితం కానిది కాసైనా సరే తాకకూడదు. అసలలాటి సొమ్ము మృత్యువేననుకో, ఎప్పడూ దానికి దూరంగా ఉండు” అని. సాధువు తన జీవితంలో డబ్బు కొరకై జరిగే అన్యాయాలు, దౌర్జన్యాలు ఎన్నో చూచాడు. అంచేత ఆయన తన తల్లిగారు చెప్పింది నిజమేనని భావించి ఎప్పడూ డబ్బుకు దూరంగానే ఉండేవాడు. ఇప్పడు - నట్టడవిలో యింత డబ్బు ఒక్కసారి కనబడేసరికి పరుగెత్తుకొని వెళ్ళిపోవటం ప్రారంభించాడు.

సాధువు కంగారుగా పరుగెత్తుకుంటూ రావటం కట్టెలు కొట్టుకోవ





డానికి వచ్చిన ముగ్గురు గ్రామీణులు చూచారు. ఏదైనా ఉపద్రవం హఠాత్తుగా వచ్చి పడుతోందా!? వాళ్లక్కూడా భయం వేసింది. వాళ్ళు కూడా ఆయనతోపాటు పరుగెత్తుతూ “ఏమైంది స్వామి, ఏమిటలా పరుగెత్తుతున్నారు?” అని అడిగారు. “మృత్యువయ్యా బాబూ! మృత్యువు! మీరు కూడా పరుగెత్తండి” అన్నాడు సాధువు.

“మృత్యువు అంటే చావే గదా! అది మీకెట్లా కనపడింది స్వామీ?” అని అడిగాడు మొదటివాడు.

“ఎక్కడ కనబడింది స్వామి” అని అన్నాడు రెండోవాడు పరుగెత్తుతూనే.

“అక్కడ కొండ లేదూ! దానిలో చిన్న గుహ ఉంది. అందులో ఉందయ్యా” అన్నాడు సాధువు.

ఆ మాటతో కట్టెలు కొట్టేవాళ్ళు సాధువును విడిచిపెట్టారు.

కొండవైపు పరుగెత్తారు. “వద్దు, వద్దు, పోకండి. ఛస్తారా అన్యాయంగా” అని మొత్తుకున్నాడు సాధువు కాస్సేపు. అటుపైన తన త్రోవన తాను వెళ్ళిపోయాడు.

కట్టెల వాళ్ళు కొండను సమీపించి, మెల్లమెల్లగా గుహ లోపలికి తొంగి చూచారు. వాళ్ళకక్కడ ఎవ్వరూ కన్పించలేదు. ధైర్యం తెచ్చుకొని లోపలికి వెళ్ళారు. మూలనున్న ధనరాశి, రత్నాలు, బంగారం వారి కంట పడింది. వాళ్ళు నోళ్ళు తెరిచారు. “సాధువు ఉత్తి పిచ్చివాడిలా ఉన్నాడు. ఇంత సంపదను చూచి మృత్యువన్నాడేంటీ? అనుకున్నారు. ఎలాగైతేనేం - మనకు మహానిధి దొరికింది. అంతేచాలు” అని సంతోషించారు. దాన్ని ముగ్గురు సమానంగా పంచుకుందాం అనుకున్నారు. మరి ధనమేమో చాలా ఉంది. జేబుల్లోనో, ఉత్తరీయంలోనో పెట్టుకొనేందుకు వీల్లేనంత ఎక్కువ ఉంది. ఎలా మోసుకుపోవటం? ఒకడన్నాడు ఒరేయ్! ఎవరమైనా ఒకళ్లం ఊళ్ళోకి వెళ్ళి సంచులు తెచ్చుకుందాం. ఇవన్నీ లెక్కపెట్టి పంచుకొనేటప్పటికి చాలా సమయం పడుతుంది. మనం మధ్యాహ్నం

వేళకే తిరిగి వెళ్ళిపోదామనుకొని చద్ది తెచ్చుకోలేదు గదా! అందుకని అన్నం కూడా తెచ్చుకుందాం". మిగిలిన వాళ్ళు సరేనంటే సరేనన్నారు. ముగ్గురిలో చిన్నవాడు ఊళ్ళోకి వెళ్ళి మూడు గోనె సంచులు, అన్నమూ తేవాలని నిర్ణయమైంది. సరే- వాడు వెళ్ళాడు. మిగిలిన వాళ్ళిద్దరూ రత్నాల రాశి ముందు కూర్చొని మూడు కుప్పల క్రింద పేర్చసాగారు. అవి ఒక్కొక్కటి కోట్ల రూపాయల విలువ చేసే అమూల్య రత్నాలు. వాటిని తమ చేతులతో తాకటమే విచిత్రంగా ఉంది కట్టెలు కొట్టే వాళ్ళకి. అంతలో ఒకడన్నాడు గదా -

"ఒరేయ్! ఇంత అంతులేని సంపదలో చిన్నాడిక్కూడా వాటా పెట్టాలంటావా?"

"ముగ్గురం పంచుకుందామనుకున్నాంగా మరి!" ఇంకొకడన్నాడు.

"అనుకున్నామనుకో! వాడికి లేకుండా మనం ఇద్దరమే పంచుకుంటే చాలా చాలా వస్తుంది మనకి".

"నిజమేననుకో! మరి వాడు వస్తాడుగా యిప్పుడు" "వస్తే రానీ - దానికి ఉపాయం చెప్తాగా!"

చిన్నాడు రాగానే ఇద్దరూ కలిసి గొడ్డళ్ళతో వాడి మెడ నరికేసి శవాన్ని తుప్పల్లో పాతిపెట్లాలని నిశ్చయించుకున్నారు చివరికి.

ఇక - మన చిన్నాడు ఇంటికి వెళ్ళి భోజనం చేసాడు. తల్లిని అడిగి మిగిలిన ఇద్దరికీ భోజనం తీసుకున్నాడు. సంచులు కట్ట కట్టుకున్నాడు. ఇక తిరిగి అడవికి నడుస్తున్నాడు. అంతలో అతనికి ఒక ఆలోచన వచ్చింది. "గుహలో అంతులేనంత సంపద ఉంది. వాళ్ళిద్దరూ పెద్దవాళ్ళు, ఇక ఆట్టే కాలం బ్రతకరు, వాళ్ళేం చేసుకుంటారు ఆ సంపదంతా! తనకొక్కడికే అదంతా దక్కితే ఎంత బాగుంటుంది! మెల్లగా వాడి తలలో పురుగు తొలచినట్లు తొలవసాగింది యీ దుష్టాలోచన. వాడొక పాముల వాడి దగ్గరకు వెళ్ళి నల్ల త్రాచు విషం కొని భోజనంలో కలిపేసాడు.





తనకు దక్కబోయే సంపదను గూర్చి కలలు కంటూ చిన్నాడు గుహ లోపలికి అడుగుపెట్టాడు. గొడ్డళ్ళతో సిద్ధముగా ఉన్న మిగిలిన ఇద్దరూ వాడి మీద పడి తల నరికేసారు. గబగబ శవాన్ని ఒక చెట్టు క్రింద పాతేసారు. దగ్గరలో ఉన్న మడుగులో స్నానాలు చేసారు. సంతోషంగా తిరిగి వచ్చారు. రత్నాలు, బంగారం వైపు చూస్తూనే చిన్నాడు తెచ్చిన అన్నం తిన్నారు. పది నిముషాల్లో వాళ్ళకు తల తిరగటం, నోట్లోంచీ రక్తం రావటం ప్రారంభ మైంది. విషప్రభావానికి వాళ్ళిద్దరూ చచ్చిపడ్డారు ఆ ధనరాశుల ముందే. పోయే ముందు వాళ్ళకు గుర్తు వచ్చింది - సాధువు "మృత్యువు మృత్యువు" అని కేకలు పెట్టటం. "అవును మనది కాని సంపద మనకు మృత్యువే!" అనిపించింది వాళ్ళకు ఆ చివరి క్షణంలో.




**సాయిధామం అభిమానులకు, సాయి వాణి పాఠకులకు వికారి నామ ఉగాది మరియు శ్రీరామ నవమి శుభాకాంక్షలు**

